ఘనంగా మొహర్రం



అన్నదానంలో కొలన్ హన్మంత్‌రెడ్డి

నిజాంపేట్: బాచుపల్లి పరిధిలోని డబుల్ బెడ్రూం-3వ బ్లాక్ వాసులు మొహర్రం పండుగను సోమవారం ఘనంగా నిర్వహించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై అన్నదానంలో పాల్గొని భక్తులకు వడ్డించారు. కార్యక్రమంలో 1వ బ్లాక్ అధ్యక్షుడు బాలబ్రహ్మచారి, 3వ బ్లాక్ అధ్యక్షుడు ప్రవీణ్, ఐ.మధు, అన్వర్, సంతోష్, దుర్గప్రసాద్, వెంకట్రావు, డా.రాజు, నందకుమార్, మల్లేశ్, నీలకంఠం, రాజు, ఉమర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



నిజాంపేట్ : కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద మంజూరు చేయించిన రూ.2,10,500 విలువైన సీఎం సహాయ నిధి చెక్కులను మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్ మాజీ కార్పొరేటర్లు రవికిరణ్, పెద్దిరెడ్డి సుజాతతో కలిసి ఐదుగురు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి సీఎం సహాయనిధి ఓ వరంలాంటిదని తెలిపారు.

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలి



సీఎండీ శ్రీదేవికి వినతి పత్రం ఇస్తున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ జెమ్మి దేవేందర్ సీఎండీ శ్రీదేవిని సోమవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొంపల్లి మున్సిపల్ పరిధిలో రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి పైపులైన్ పనులు నిలిచిపోయాయని, రూ.12 కోట్ల నిధులు విడుదల చేయాలని కోరుతూ ప్రతిపాదనలు అందించామన్నారు. అలాగే దుండిగల్, కొంపల్లి మున్సిపాలిటీలు, నిజాంపేట్ కార్పొరేషన్ల పరిధిలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చేలా వ్యవహరిస్తున్నారని, వారిని కట్టడి చేయాలని విన్నవించామని పేర్కొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



దుండిగల్: వాహనం ఢీకొని గుర్తు తెలియన వ్యక్తి మృతి చెందిన ఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 4న గండిమైసమ్మ చౌరస్తాలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సదరు వ్యక్తి వివరాలు తెలియకపోవడంతో పోలీసులు మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఎవరైనా సంబంధీకులు ఉంటే దుండిగల్ ఏఎస్‌ఐ గంగాధార్ 9397667080 ను సంప్రదించాలని పోలీసులు సూచించారు.

ప్రజావాణికి ఫిర్యాదుల వెల్లువ

అధికారులకు 31 వినతిప్రతాల అందజేత

కుత్బుల్లాపూర్: జంట సర్కిళ్ల పరిధిలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం 21 ఫిర్యాదులు వచ్చాయి. ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలో మొత్తం 11 ఫిర్యాదులు రాగా వాటిలో అక్రమ నిర్మాణాలపై 6 , ఇంజినీరింగ్ 3, వెటర్నరీ 1, యూజీడీ 1 వచ్చాయని, వాటిని సంబంధిత శాఖ అధికారులకు పంపి వారం రోజుల్లో సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఉప కమిషనర్ నరసింహ తెలిపారు. అదేవిధంగా గాజులరామారం సర్కిళ్ల పరిధిలో ఉప కమిషనర్ మల్లారెడ్డి అధ్యక్షతన ప్రజావాణికి 10 ఫిర్యాదులు రాగా వాటిలో అత్యధికంగా టౌన్‌ప్లానింగ్ విభాగంపై 7, ఇంజినీరింగ్ 3 ఫిర్యాదులు వచ్చాయని ఆయన తెలిపారు.



ఉప కమిషనర్ నర్సింహకు వినతి పత్రం ఇస్తున్న సుధాకర్



ఫిర్యాదులు స్వీకరిస్తున్న జలమండలి జీఎం మాధవి

అధికారులు లేని ప్రజావాణి ఎందుకు..?

కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని ప్రజావాణిలో టౌన్ ప్లానింగ్ అధికారులు లేకపోవడంపై బ్యాంక్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సుధాకర్ ఉప కమిషనర్ నరసింహతో వాగ్వాదానికి దిగాడు. ఇద్దరు అధికారులు లేకుండా ఫిర్యాదు ఎవరికీ చేయాలని గతంలో పార్కు స్థలం విషయంలో కోర్టు కాలనీ అసోసియేషన్‌కు తీర్పు అనుకూలంగా వచ్చినప్పటికీ అక్కడ సుమారు రూ.6 లక్షలతో చేపట్టాల్సిన పనులు నిలిపేయడం ఆంతర్యం ఏంటని ప్రశ్నించారు. అదేవిధంగా సూరారం ప్రాంత పరిధిలో 15 ఫీట్ల రోడ్డులో రహదారికి అడ్డంగా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడంతో రాకపోకలు నిలిచిపోతున్నాయని తగు చర్యలు చేపట్టాలని స్థానిక నాయకుడు రవీందర్ ముదిరాజ్ అధికారులకు వినతిపత్రం అందజేశారు.

వాటర్ వర్క్స్ కార్యాలయం 8 ఫిర్యాదులు..

చింతల్: కుత్బుల్లాపూర్ వాటర్ వర్క్స్ కార్యాలయంలో ప్రజావాణికి 8 ఫిర్యాదులు వచ్చాయని కుత్బుల్లాపూర్ వాటర్ వర్క్స్ జీఎం మాధవి తెలిపారు. ఆయా సెక్షన్ల పరిధిల్లో లోప్రెషర్ సమస్యపై 3, నూతనంగా భూగర్భ డ్రైనేజీ పైపులైన్లు వేయాలంటూ 4, తాగునీటికి అదనపు నీటి బిల్లులు వస్తున్నాయని 1 ఫిర్యాదు వచ్చిందని పేర్కొన్నారు. డీజీఎంలు రవి, వికాస్, జలమండలి మేనేజర్లు, ఎలక్ట్రికల్ మేనేజర్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాన్ని కాపాడండి

దుండిగల్: తప్పుడు పత్రాలతో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమిస్తున్న కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని మాజీ కౌన్సిలర్ శంకర్ నాయక్ కోరారు. ఈ మేరకు గండిమైసమ్మ-దుండిగల్ తహసీల్దార్ సయ్యద్ మతీన్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దుండిగల్ గ్రామ రెవెన్యూలోని సర్వే నంబర్-684 లో కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వభూమిని కొందరు వ్యక్తులు కబ్జా చేసి నిర్మాణలు చేపడుతున్నారన్నారు. ఐదేళ్ల క్రితం 1000 గజాలు తండా ప్రజల అవసరం కోసం మల్టీపర్పస్ కమ్యూనిటీ ఫంక్షన్ హాల్ నిర్మాణం కోసం దరఖాస్తు ఇస్తే ఇప్పటి వరకు కేటాయించలేదన్నారు. 684 సర్వే నెంబర్ లోని 425.24 ఎకరాలు గుర్తించి సరిహద్దులు ఏర్పాటు చేయాలని కోరారు. సీనియర్ నాయకులు రవీందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నిజాంపేట్ కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలి

నిజాంపేట్: అక్రమార్కులకు సహకరిస్తున్న కమిషనర్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆకుల సతీశ్ ప్రజావాణిలో అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తాకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో పార్కులు, ప్రభుత్వ స్థలాలు, చెరువులు, రోడ్లు అక్రమించుకుని, అక్రమ అనుమతులపై చేపట్టిన నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని పూర్తి ఆధారాలతో పలుమార్లు ఫిర్యాదు చేసిన కమిషనర్ షోకాజ్ నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో అరుణ్‌రావు, ఈశ్వర్‌రెడ్డి, తిలోక్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



ర్యాలీలో ట్రాఫిక్ ఏసీపీ వెంకట్‌రెడ్డి, సీఐ విద్యార్థులు

కుత్బుల్లాపూర్: వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ ఏసీపీ వెంకట్‌రెడ్డి అన్నారు. జీడిమెట్ల గ్రామం నుంచి గాంధీ విగ్రహం వరకు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో కలిసి సోమవారం ర్యాలీ నిర్వహించారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ వాహనదారులకు అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలని, రూల్స్ అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని, అదేవిధంగా అతివేగంగా ప్రయాణిస్తే ప్రాణాలు కోల్పోవడం కారణంగా బాధిత కుటుంబం రోడ్డున పడుతుందని అవగాహన కల్పించారు. అల్వాల్ ట్రాఫిక్ సీఐ ఏ.నాగరాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించాలి



అధికారులకు ఫిర్యాదు చేసిన బీజేపీ శ్రేణులు, స్థానికులు

నిజాంపేట్: బాచుపల్లి మండలం నిజాంపేట్‌లోని సర్వే నంబర్ 17,19,20లో గల జంగారి కుంట ప్రభుత్వ స్థలం కబ్జాకు గురికాకుండా కాపాడాలని నిజాంపేట్ బీజేపీ అధ్యక్షుడు భిక్షపతి యాదవ్ ఆధ్వర్యంలో స్థానికులు తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా భిక్షపతి మాట్లాడుతూ.. ప్రస్తుత ఎమ్మెల్యేను 3 సార్లు గెలిపిస్తే పార్కుగా మార్చుతామని ఇచ్చిన హామీ నెరవేర్చడం లేదన్నారు. జంగరి కుంట స్థలాన్ని పార్క్‌కు కేటాయించి హద్దులు ఏర్పాటు చేస్తే స్థానిక ప్రజలు సొంత డబ్బులతో పార్కుగా అభివృద్ధి చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నారని, వెంటనే ఫీల్డ్ విజిట్ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా అధికార ప్రతినిధి నాగరాజు, పార్లమెంట్ మీడియా సెల్ కన్వీనర్ సుమన్‌రావు, ప్రధాన కార్యదర్శి సచిన్, బీజేవైఎం అధ్యక్షుడు రాజేశ్, కాలనీవాసులు ప్రభాకర్, శరత్, చరణ్, మహేశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



అప్పగించిన ఫోన్లతో బాధితులు

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అప్పగింత

జీడిమెట్ల: బాలానగర్ జోన్ పరిధిలోని వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న బాధితులకు జీడిమెట్ల పోలీసులు మొబైల్స్‌ను తిరిగి అప్పగించారు. జీడిమెట్ల, సనత్‌నగర్, బాలానగర్, జగద్గిరిగుట్ట పీఎస్ పరిధిలో మొత్తం 69 మంది ఫోన్లు పోగొట్టుకున్నారని వాటి విలువ రూ.15.26 లక్షలు ఉంటాయని పోలీసులు తెలిపారు. సోమవారం జీడిమెట్ల పీఎస్‌లో బాలానగర్ ఏసీపీ నరేశ్‌రెడ్డి జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేశ్, డీఐ కనకయ్యతో కలిసి విలేకరుల సమేవేశం ఏర్పాటు చేసి బాధితులకు అప్పగించారు.

రవీంద్రభారతి గ్లోబల్ స్కూల్లో 'వన మహోత్సవం'

దుండిగల్: గండిమైసమ్మలోని రవీంద్రభారతి గ్లోబల్ స్కూల్‌లో సోమవారం వన మహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాలు రంజిత్‌కుమార్, సందీప్ ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో పాఠశాల ఏజీఎం జ్యోతి, కిశోర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలను ఉపేక్షించం



ఏసీపీ సునీత

కుత్బుల్లాపూర్: అక్రమ నిర్మాణాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని గాజులరామారం సర్కిల్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ సునీత హెచ్చరించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆమె పలు ప్రాంతాల్లోని అక్రమ నిర్మాణదారులకు సోమవారం నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా 'సాక్షి'తో ఆమె మాట్లాడుతూ.. గడిచిన 10 రోజుల్లో సుమారు 15 నోటీసులు అందించామని ఎస్టీఎఫ్ టీంకు నివేదించి వాటిని కూల్చివేస్తామని స్పష్టం చేశారు. అలాగే గతంలో జరిగిన నిర్మాణాలకు నోటీసులు అందజేశారా..? లేదా..? అనే విషయంపై ఆరా తీస్తానని పేర్కొన్నారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం



ప్రవళికకు చెక్కును అందజేస్తున్న శివరామకృష్ణ

జీడిమెట్ల: గీతం కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న ప్రవళిక తండ్రి చనిపోయాడు. తల్లికి ఆరోగ్యం సరిగా లేకపోకపోవడంతో ప్రవళిక నాయనమ్మ వద్ద ఉండి చదువుతోంది. ఈ విషయం తెలుసుకున్న హార్ట్ టు హెల్ప్ చారిటబుల్ ట్రస్ట్ రవినాయక్ దాతల సహాయంతో ప్రవళిక కళాశాల ఫీజు మొత్తం చెల్లించేందుకు ముందుకు వచ్చాడు. దాత శివరామకృష్ణ ద్వారా ప్రవళికకు రూ.10 వేల చెక్కును సోమవారం అందజేశారు.

హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయరూ..!

రంగారెడ్డినగర్: ప్రధాన రోడ్డుపై తవ్వి వదిలేసిన గుంతతో ప్రమాదం పొంచి ఉంది. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి గిరినగర్ నాలా కల్వర్టు వద్ద 2 రోజుల క్రితం జలమండలి ఆధ్వర్యంలో పైపులైన్ మరమ్మతులకు గుంతను తవ్వారు. అయితే సదరు కాంట్రాక్టర్ దాని చుట్టూ బారికేడ్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. నిత్యం వాహనాలతో రద్దీగా ఉండే ఈ రోడ్డుపై వెళ్లే వాహనదారులు గుంతలో పడి ప్రమాదం బారిన పడే ఆస్కారముంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించిన హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసి పనులు త్వరగా పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.



గిరినగర్ కల్వర్ట్ నాలా సమీపంలో తవ్విన గుంత

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం



జగద్గిరిగుట్టలో ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు



కుత్బుల్లాపూర్ మున్సిపల్ సర్కిల్‌లో..



కేక్ కట్ చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు ..

నిజాంపేట్: రాజీవ్‌గాంధీనగర్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు ఎర్రోళ్ల యేసు ఆధ్వర్యంలో సోమవారం పద్మశ్రీ మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలతో పాటు ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు గుండు ఖాదరయ్య, ముత్యపాగ శ్రీనివాస్, జిల్లా ఇన్‌చార్జి అరుణ్, రాసమల్ల యాదగిరి, ఎంఎస్‌పీ నాయకులు రాజు తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్‌నగర్‌లో..

చింతల్: భగత్‌సింగ్‌నగర్ మాదిగ కుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాన్, ఎమ్మార్పీఎస్ కన్వీనర్ శోభన్ భగత్‌సింగ్‌నగర్‌లో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు భూమయ్య, నరసయ్య, రాజు, లక్ష్మణ్, పెద్ది రాజయ్య, రమేశ్ చారి పాల్గొన్నారు.

జగద్గిరిగుట్ట డివిజన్ బస్టాండ్ ప్రాంతంలో

జగద్గిరిగుట్ట: బస్టాండ్ ప్రాంతంలో ఆర్టీసీ విభాగం మాదిగ ఎంప్లాయీస్ ఫెడరేషన్ చైర్మన్ వల్లూరి బాబు మాదిగ ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు డప్పు రామస్వామి, ఎర్ర యాకన్న బండ మహేందర్, దౌపాటి మల్లేశ్, ఎర్ర వీరన్న, ఎర్ర సైదులు, అనిల్, ప్రభాకర్, చిప్పలపల్లి బాబురావు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ సర్కిల్‌లో..

కుత్బుల్లాపూర్: మున్సిపల్ సర్కిల్‌లో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కో ఇన్‌చార్జి మునిరాతి అరుణ్ కుమార్ మాదిగ ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. అదే విధంగా కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు సిలువేరు శ్రీనివాస్ మాదిగ, రాసమల్ల యాదగిరి మాదిగ, ముత్యపాక శ్రీనివాస్ మాదిగ, ఇస్రాం రమేశ్ మాదిగ, సంఘీ మహేశ్, నడిమి దొడ్డి సలోమి మాదిగ, మహేశ్వరి, రామదుగు సిద్ధయ్య, ఇందూరం తిరుపతి పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న నాయకులు

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కుత్బుల్లాపూర్: ఫీడర్ లైన్ల నిర్వహణ నేపథ్యంలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని కొంపల్లి సెక్షన్ ఏఈ శ్రీనివాసులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 11 కేవీ అపర్ణ ఫీడర్ పరిధిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సెంట్రల్ పార్క్, అనుపమ నేచర్, అపర్ణ వెంచర్స్, మికాసా విల్లాస్, రాజధాని దాబా, కొంపల్లి బ్రిడ్జి లేన్, 11కేవీ కొంపల్లి ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుండి సాయంత్రం 5 గంటల వరకు నందక ఆస్పత్రి రోడ్డు, సురక్ష హాస్పిటల్, బొబ్బులి లేన్, సెంట్రల్ పార్క్, కొంపల్లి మున్సిపల్ కార్యాలయ ప్రాంతాల్లో కరంట్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

జగద్గిరిగుట్ట సబ్‌స్టేషన్ పరిధిలో..

జగద్గిరిగుట్ట: చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో జగద్గిరిగుట్ట సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ రాధాకిషన్ రెడ్డి తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మగ్దూం నగర్, సీసలబస్తీ, పాలాల బస్తీ, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రింగ్‌బస్తీ, శ్రీనివాస్‌నగర్, లెనిన్‌నగర్ ప్రాంతాలు.

వివిధ సబ్‌స్టేషన్ల పరిధిలో..

చింతల్: వివిధ సబ్ స్టేషన్ల పరిధిలో మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆయా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని బోయిన్‌పల్లి ఏడీఈ శ్రీకాంత్ తెలిపారు. 33/11 కేవీ బోయిన్‌పల్లి సబ్‌స్టేషన్ ప్లాసీ లైన్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంటవరకు ఆర్.ఆర్.నగర్ మెయిన్ రోడ్డు 1 నుంచి 10 వరకు, చెక్‌పోస్ట్, నందమూరినగర్. అలాగే గన్‌రాక్ సబ్‌స్టేషన్ అంజయ్యనగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు అంజయ్యనగర్, బోయిన్‌పల్లి వెజిటేబుల్ మార్కెట్ సరౌండింగ్ ఏరియాస్, సుబ్బారెడ్డి హౌస్ తదితర ప్రాంతాలు.

11కేవీ ఆర్‌ఎం నగర్ ఫీడర్ పరిధిలో..

సుభాష్‌నగర్: ఫీడర్ లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని గాజులరామారం సెక్షన్ ఏఈ చైతన్యభార్గవ్ తెలిపారు. 11కేవీ ఆర్‌ఎం నగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పీపీనగర్, భవానీనగర్ చిత్తారమ్మ దేవీనగర్, చంద్రగిరినగర్, జైశంకర్ నగర్, మల్లారెడ్డినగర్, భరత్ ఫంక్షన్ హాల్, పీఎస్ఆర్ ఎంపైర్ వెంచర్. అలాగే 11 కేవీ శ్రీరామ్‌నగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు శ్రీరామ్‌నగర్ ఏ, బి, బేకరీ గడ్డ, ఎస్‌సీబీ నగర్, జహంగీర్ బస్తీ, ఎం.ఎఫ్ ఫంక్షన్ హాల్ రోడ్డు, ఉమాదేవీనగర్, ఎన్టీఆర్‌నగర్, అంబేడ్కర్‌నగర్, చంద్రగిరినగర్ ప్రాంతాలు.

రోడ్డుకు అడ్డుపెట్టిన రేకులను వెంటనే తొలగించాలి



మల్లంపేటలో ఆందోళన చేస్తున్న స్థానికులు

దుండిగల్: గ్రామానికి వచ్చే రోడ్డుకు అడ్డుగా పెట్టిన రేకులను వెంటనే తొలగించాలని డిమాండ్ చేస్తూ మల్లంపేట ప్రాంతవాసులు సోమవారం రోడ్డుపై నిరసన తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. మల్లంపేట నుంచి బాచుపల్లికి వెళ్లేందుకు గతంలో పాత హైదరాబాద్ రోడ్డు ఉండేది. క్రమంగా ఆ రోడ్డు గుండా వెంచర్లు, విల్లాలు ఏర్పడడంతో రోడ్డుకు అడ్డంగా గోడలు నిర్మించారు. ఈ విషయమై గతంలో హైడ్రా అధికారులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన వారు గత నెలలో బాచుపల్లిలోని ప్రణవ్ ఆంటీలియా గేటెడ్ కమ్యూనిటీ సరిహద్దు గోడతో పాటు మల్లంపేటలోని పీవీఆర్ హైరైజ్ మెడోస్ కమ్యూనిటీకి చెందిన రెండు ప్రహరీలు కూల్చివేశారు. కాగా తిరిగి కమ్యూనిటీ అసోసియేషన్ సభ్యులు ప్లాస్టిక్ రేకులు అడ్డుగా పెట్టడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం మల్లంపేట బస్టాప్ వద్ద బీజేపీ నేత ఎంబరి ఆంజనేయులుతో పాటు స్థానికులు నిరసనకు దిగారు. వెంటనే రోడ్డును పునరుద్ధరించాలని డిమాండ్ చేవారు. పోలీసులు అక్కడికి చేరుకుని వారికి నచ్చజెప్పి పంపించారు. రోడ్డును తిరిగి తెరిపించి స్థానికులకు అందుబాటులోకి తీసుకువచ్చే వరకు ఆందోళనలు చేపడుతామని వారు స్పష్టం చేశారు.

ఉమెన్స్ సేఫ్టీపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ సత్యం, సీడీడబ్ల్యూ సిబ్బంది

జగద్గిరిగుట్ట: సీడీడబ్ల్యూ జీడిమెట్ల, జగద్గిరిగుట్ట పోలీసుల ఆధ్వర్యంలో జగద్గిరిగుట్ట రాజీవ్‌గృహకల్పలో మహిళలకు రక్షణ, ఫ్యామిలీ సమస్యలపై సోమవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా జగద్గిరిగుట్ట ఎస్‌ఐ సత్యం మాట్లాడుతూ.. మహిళలు అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలని, తమ పిల్లలను ఒంటరిగా వదలవద్దని సూచించారు. కుటుంబ వివాదాలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని, అందుకు సీడీడబ్ల్యూ, పోలీసుల సహకారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో సీడీడబ్ల్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

9న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి



సమావేశమైన వామపక్షా కార్మిక సంఘాలు



షాపూర్‌నగర్ ప్రధాన రోడ్డులో ర్యాలీ తీస్తున్న ఆటో యూనియన్ల కార్మికులు

నిజాంపేట్: ఈనెల 9న తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ, ఏఐటీయూసీ, ఏఐసీటీయూ వామపక్షా కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. నిజాంపేట్ కార్పొరేషన్ ప్రగతినగర్ సుందరయ్య భవన్ వద్ద సీఐటీయూ జిల్లా నాయకుడు ఎం. చంద్రశేఖర్ అధ్యక్షతన సోమవారం సమావేశం నిర్వహించారు. ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పాలబిందెల శ్రీనివాస్, సీఐటీయూ జిల్లా నాయకుడు జి.వెంకటరాజ్యం, ఏఐసీటీయూ మండల నాయకులు పి.దస్తగిరి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 29 కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చేందుకు యత్నిస్తుందన్నారు. అలాగే ప్రభుత్వ సంస్థల ప్రైవేటీకరణ వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. పి.పెంటయ్య, బాలవెంకటేశ్వర్‌రావు, నాగభూషణం, రాధాకృష్ణ, రవి కుమార్, బోయకుమార్ పాల్గొన్నారు.

సమ్మెకు కేవీపీఎస్ సంపూర్ణ మద్దతు

సమ్మెకు కుల వివక్ష వ్యతిరేక పోరాటం సంఘం (కేవీపీఎస్) మేడ్చల్ జిల్లా కమిటీ సంపూర్ణ మద్దతు ప్రకటించినట్లు కేవీపీఎస్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి నాగనిగళ్ళల బాలపీరు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. బీజేపీ విధానాలపై దేశవ్యాప్త పోరాటానికి కేవీపీఎస్ సామాజిక శ శక్తులను కలుపుకుని పోరాడుతుందని పేర్కొన్నారు.

వామపక్షా ఆటో యూనియన్ల ఆధ్వర్యంలో ర్యాలీ..

కుత్బుల్లాపూర్: సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ వామపక్షా ఆటో యూనియన్ల ఆధ్వర్యంలో జీడిమెట్ల బస్ డిపో నుంచి ఉషోదయ టవర్స్ వరకు సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ, ఏఐటీయూసీ, టీయూసీఐ నాయకులు మాట్లాడుతూ.. రవాణా రంగ కార్మికులు ఆటో డీసీఎం, లారీ మినీ గూడ్స్ వెహికల్ డ్రైవర్లు, ఓనర్లు పాల్గొనాలన్నారు. సీఐటీయూ కుత్బుల్లాపూర్ మండలాధ్యక్షుడు లక్ష్మణ్, అంజయ్య, ఏఐటీయూసీ జిల్లా నాయకులు స్వామి, ప్రవీణ్, నరసింహారెడి, టీయూసీఐ రాష్ట్ర నాయకుడు ప్రవీణ్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి



మహిళా గ్రూపు సభ్యులతో సమావేశమైన హరిప్రియ

కుత్బుల్లాపూర్: మురికివాడల్లో మహిళా గ్రూపు సంఘాల ప్రతినిధులు పర్యటించి వర్షాకాలంలో వచ్చే ప్రబలే సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని ప్రాజెక్టు అధికారి హరిప్రియ అన్నారు. గాజులరామారం, కుత్బుల్లాపూర్ జంట సర్కిల్ పరిధిలోని 8 డివిజన్లకు చెందిన మహిళా గ్రూప్ సభ్యులతో సర్కిల్ కార్యాలయ ఆవరణలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలతో పాటు ప్రజల అవసరాలను తీర్చే ప్రతి కార్యక్రమంలో భాగస్వాములు కావాలన్నారు. మహిళా శక్తి సంబరాల నేపథ్యంలో అన్ని గ్రూపు సంఘాలు టౌన్ లెవెల్ ఫెడరేషన్ సహకారంతో ముందుకు సాగాలని, మంగళ, బుధవారాల్లో స్లమ్ లెవల్ ఫెడరేషన్ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేసి వడ్డీ లేని రుణాలతో పాటు బహిరంగ సభ ఏర్పాటు కోసం ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రితో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొనున్నట్లు విజయవంతం చేయాలని కోరారు.